

# నాటికి నేడు

## శ్రీ విశ్వనాథ కవిరాజు

ద్వైపాత్రిక—దృశ్యము

యమ్. యస్. యమ్. మెయిలులో చిన్న యింటర్ క్లాసు పెట్టె

ఆసనం మీద పెద్ద సూటుకేసు, జాయబద్దల సజ్జా పళ్లతో, జాలరుసంచీ, కంచుమరచెంబూ- కాశీమజిలీల పుస్తకమున్న. మహాలక్ష్మమ్మగారు 60 ఏండ్ల ముత్తైదువు. ఒక 5-10 ఏళ్లు చిన్నగానే కనబడుతుంది. తల మూడువంతులు నెరసింది. నిండు విగ్రహం. నగలు పూర్వ.కాలపు పట్టెడా నానుతో ఇప్పటి గడియారపు గొలుసూ జాజిమొగ్గల పేరూ కలిసి వున్నవి. ఒడ్డాణము మాత్రం లేదు. కంచిచీర. రవిక టపేటాసిల్కు- కాబోలు. తమల పాకులు ఒక్కటొక్కటి చీరి వేసుకొంటూ మధ్య మధ్య పండిందో లేదో అని నాలుక చాచి చూచుకుంటూ వుంటుంది.

తలుపు తెరచుకొని నరుసు పంతులు సన్నని మనిషి- కాయశరీరం గనుక వయసు సరిగా చెప్పలేము. 65సం॥ ఉండ వచ్చును. చిన్న క్రాపింగూ-పెద్దమీసాలూ రెండిటికీ రంగు. కమీజు మీదుగా పంచ.

మహా:—ఇందులోకి వచ్చేరేమిటి? వెళ్లండి వెళ్లండి.

నరు:—నే నేం బిచ్చానికి రాలేదండి-నేనూ ప్రయాణీ కుణ్నే-టిక్కెట్టు కొన్నాను.

మహా:—మీకీబండీయే దొరికిందా యేమిటి?

నరు:—ఏ బండీలో వాళ్లు ఆ బండీలోకే రావద్దు పొమ్మంటూంటే ఎందులో కూచోవడం? దింపరా సామాను,

మహా:—అయితే ఆడవాళ్లపెట్టెలో యెక్కి పోతా వయ్యా?

నరు:—కొంప మునిగింది-ఇది ఆడవాళ్ల బండీవా- చెప్పవేమిరా మాస్తూ ఊరుకుంటావు-పదపద. (దిగిపోతాడు)

మహా:—తలుపు గట్టిగా వేసుక పొండి...అబ్బా! సిగ్గు లేకుండా ఈ మగాళ్లేమి తోసుకొస్తా రాడ వాళ్ల బళ్లల్లోకి! (నరసు పంతులు తలుపు తెరచుకొని వచ్చేడు) మళ్లీ వచ్చేరేమిటి?

నరు:—మళ్లీ ఎక్కడ వచ్చేను? అప్పటి నుంచీ ఈ లాగె కాళ్లు కాలిన పిల్లిలాగు తిరుగుతున్నాను. దింపరా సామాను దింపు.

మహా:—మీకీబండీ తప్ప ఇంకొకటి పనికి రాదా యేమి?

నరు:—ఇది ఆడవాళ్ల బండీ కాదటమ్మా. పైని ఆడ బొమ్మ లేదు. లేడీస్ (Ladies) అని రాసి వుండ లేదు.

మహా:—లోపల నేనున్నాను కానటయ్యా? పైకి బొమ్మా పేరూ వుండాలా? ఇది ఆడవాళ్ల బండీ కాకుంటే మా మనమడు నన్నిందులో యెందుకు కూర్చో పెట్టేడు?

నరు:—నా కేం తెలుసునండీ మీ మనమడెవరో యెందుకు కూర్చో పెట్టేడో-ఇంటికి వెళ్లి ఉత్తరం రాయండి. బండీ కదుల్తున్నాది- తేరా సామాన్లు తే. (లోపలికి ట్రంకూ పరుపూ మూటా లాంగు కోటు మొదలైన పందుకొని)...అదుగో వేదకాసు క్రింద పడి పోయింది తీసుకో...బ్రతుకు జీవుడా! గంటముందర వచ్చేను కాని ఈ వేళ ట్రెయినులో కూర్చుంటా ననుకో లేదు.

మహా:—ఇది ఇంటర్ క్లాసయ్యా!

నరు:—నా బుర్ర చూస్తే మీకు మూడవక్లాసు బుర్ర లాగు కన బడు తుందా? నేనూ ఏదో గౌరవం గల మనిషిని గాని అంత గతిలేని వాణ్ని కానండి.

మహా:—అయితే యింత దూరమూ నేను మీ ఒక్కరి తోనూ ప్రయాణం చెయ్య వలసిందే! నా వొళ్లు చచ్చి పోతున్నాది-ఏం దారి?

నరు:—నేను బండీ యెక్కి పోయినాను; రైలేమో నడిచి పోతున్నాది. మీరు లక్ష చెప్పినా నేను దిగను గదా! ఎందుకు సణుగుతారు?

మహా:—ఏమో చెప్తారుగాని—'ఆడపిల్ల ఒక్కర్తె వున్నది అక్కడ మనకేం పని' అన్న జ్ఞానం వుండ వద్దటండీ యెవరికైనా?

నరు:—మీరు నూరు మహాజోరుగా వదలేస్తున్నారు. మీ పక్షంలో అది యేమీ బాగుండ లేదు. మీ కంత పరాయి పురుషుల వాసన కిట్టక పోతే ఆడవాళ్ల బండీలో కూర్చుండ వలసింది.

మహా:—ఆ భడవ అలాగైనా కూర్చోబెట్టేడా? లేక తాను రానైనా వచ్చేడా? 'పగటి వేళ భయమే మిటి నాయనమ్మా' అని ఒక్కర్తెనూ పంపించేశాడు.

నరు:—ఇప్పుడు మాత్రం భయమేమిటి చెప్పండి మీరా లాగు బెంబేరు పడి పోతున్నారు గాని. మీరెక్క డకు వెళ్తారు?

మహా:—ఎక్కడ బాబూ- బెజవాడ.

నరు:—శ్రీ రామచంద్రా! మా పైనే! కానియ్యండి.

మహా:—మీరో!

నరు:—నిడదవోలు.

మహా:—భగవంతా! అంతవరకూ వుందీ- ఈ యమ యాతన?

నరు:—ఎందు కండీ వట్టి రవ్వారట్టూను? తోడు లేకుండా మీరొక్కరూ మాత్రం ఎంతకని ప్రయాణం చెయ్య గలరు? నేనేం రాక్షసుణ్ని గాను; పిశాచాన్ని గాను. ఏదో మీ సోదరుడు లాంటి వాణ్ని.

మహా:—కానివ్వండి, ఏం చేస్తాము.

నరు:—సామాన్లు సర్దుకుందామా?

మహా:—నే నొక్క వస్తువ ముట్టుకోలేను. మా మనమడు సామాన్లిక్కడ పడ వేశాడు; బెజవాడ దగ్గర మా మనమరాలు మొగుడు వచ్చి దింపేస్తాడు. ఆ సామాన్ల ప్రక్కనే ఏదో చోటు చూచుకొని కూర్చుండండి... అసలు ఇంటి దగ్గర నేనొక పని చెయ్యను.

నరు:—నేనున్నాను కదూ-లోకంలో పుట్టిన వాళ్లకీ పుట్ట బోయే వాళ్లకీ-అందరికీ చాకిరీ చేసే శాఖరీవాణ్ణి, నేను సర్దుతాను. (చిల్లర వస్తువులు పైబల్లల మీద వేరు వేరుగా సర్ది ట్రంకులు క్రింద పెడతాడు)

మహా:—ఆ కాశీమజిలీల పుస్తకం ఈలాగు ఇచ్చి వేయండి (పుచ్చుకొంటుంది) ఈ ట్రంకు ఇక్కడ పెట్టే రేమిటి?

నరు:—చపటముండాకొడుకుని - ట్రంకులు మీద కత్తితే నెత్తి పగిలి సస్తాను.

మహా:—చెయ్యి వ్రేల వేస్తే చేతికి తగుల్తున్నాది- ఏలాగండీ?

నరు:—సర్దుతాను- ఏం చేస్తాను మరి- (లేచి కాళ్లకు క్రిందుగా లాగుతాడు)

మహా:—అక్కడ వద్దండీ. కాలు క్రింద పడితే బ్రద్దలౌతుంది.

నరు:—(లేచి మళ్లీ మధ్యకు సర్ది) సరా! ప్రాణం పుచ్చుకున్నారు.

మహా:—మిమ్మల్ని ఎవరు సర్దమన్నారు- ఎవరు విసువు కోమన్నారు? ఏమిటీ ముసలి కోపం?

నరు:—ఆ- లోకంలో అందరూ పడుచు వాళ్లూ యవ్వనవంతులూ నే నొక్కణ్ణే ముసలి వాణ్ణి-పుట్టి నప్పుడే మా అమ్మ ఒక ముసలి ముద్దను కని భూభారంగా పడ వేసింది.

మహా:—ఆం ఆంటే కోపం ఊఁ అంటే కోపం- ఏ మహాయిల్లాలు మీ దగ్గర కాపురం చేస్తున్నదో గాని.

నరు:—మీ వల్ల మీ భర్త భూలోకస్వర్గం అనుభవిస్తూ వుంటాడు.

మహా:—(దిగ్గునలేచి) ఏమిటి నాకీ సవతి పోరు? మీరు నాతో మాటాడ వలసిన అగత్యం లేదు- మాటాడ కండి. (పండుకొంది)

నరు:—రక్షించేరు గదూ (తానూ తన బల్ల మీద పండుకొన్నాడు)

మహా:—నాతో సమానంగా పండుకొన్నారు- నన్ను బ్రదకనివ్వరా యేమిటి?

నరు:—రెండు గంటలు నేమన్నా కూర్చోవి నడుము పీకిపీకి సస్తున్నాను. ఎలాగు చచ్చేదమ్మా.

మహా:—ఆలాగు కిటికీకి చేరబడి కూర్చుండండి.

నరు:—నేను కూర్చుండి మీరు పండు కొంటే మాత్రం ఘనమా యేమిటి?

మహా:—ఉదయం లేచి యెవరి మొఘం చూచేనో (కూర్చుంటుంది)

నరు:—చామర్లకోట దగ్గర పెట్టె మార్చుకుంటాను. లేకుంటే అక్కడ దిగి ప్యాసెంజరులో పోతా. అందాకా నన్ను కాపాడండి (కూర్చుంటాడు) ఏ ముహూర్తాన బయలు దేరినానో- అల్లరీ- చిదర-చిరాకు.

మహా:—(కొరకొర చూస్తుంది)

నరు:—ఇంక నన్ను మాటాడించకండి; నా వైపు చూడ కండి. నేనీబండీలో లే ననుకొనే యీ రెండు ఘడియలూ కళ్లు మూసుకొని కాలక్షేపం చెయ్యండి. నేను చదువుకుంటాను. (పుస్తకం లాంగుకోటులోనించి తీస్తున్నాడు)

మహా:—నేనూ చదువు కుంటాను. (కాశీమజిలీలు విప్పి కథ క్షణం వెదుకుతుంది)

(ఇద్దరూ ఒక్క మారుగానే గట్టిగా) "పూర్వకాలంబున ఆంధ్ర దేశంబున కెల్ల తిలకాయమానంబగు విదర్భ దేశంబను పురవరంబున నవభానుకోటి సుందరాకారుండును రాజన్య పదపద్మ లాంఛిత శిరోరుహండును...

నరు:—" గీ|| కన్ను లాసగియు నీ మూర్తి గాంచనీదు
వీను లాసగియు నీ నుడుల్ వినగ నీదు
లను వొసంగియు నీ మేను తాక నీదు
విధికి నేనేమి విసము మేపితిని తరుణి!
ప్రేయసీ! నీశరీరంబు ప్రీ
(ప్రియ?) తమంబు

మహా:—ఇదేమిటీ మాలగోల? ఊత్తి వుత్తినే ఎందుకు నన్నిలాగు వెర్రెత్తిస్తున్నారు?

నరు:—ఎవరు మీరా? నేనా? ఆ వచనం ముక్క లంత గట్టిగా చదవాలటండీ!

మహా:—నాథ కర్తగారు నాకు రాసిన ఉత్తరాలైనా నేను గట్టిగా చదువుతాను అలాగు పైకి చదివితేనే కాని నాకు బోధపడదు.

నరు:—మీరు గట్టిగా చదివితే నాకు బోధపడదు.

మహా:—బోధపడక పోతే మాని వేయండి.

నరు:—మీ కాశీమజిలీల కోసం నా పద్యాలు మాను కోవాలా? 'ఏనుగు వస్తున్నాయి బళ్లడ్డంగా తీయండి' అన్నారుట!

మహా:—మీ రేం మహాభారతభాగవతాలు చదువు తున్నారు- భక్తచింతామణి పద్యాలేకదూ!

నరు:—ఏవైనా పద్యాలవును గదా! ఎంత పుచ్చిన మిరియాలైనా జొన్నల పాటి చేయక పోవు. ఇత్తడి యిత్తడే; పుత్తడి పుత్తడే. నా మాట విని రెండు పద్యాలు చదువుతాను వినండి. మహాఉత్కృష్టమైన గ్రంథం. ఉన్నత భావాలు, ప్రతిపద్యం రసంతో చిప్పిలుతూ వుంటుంది. పద్యం గ్రంథకర్త నోట వినడంలో ఒక ఆనందం వుంది-అదో అదృష్టం.

మహా:—మీరు వడ్డాది సుబ్బారాయ కవి గార టండీ! చెప్పేరు కారే.

నరు:—నేనూ రమా రమీ అలాటీ వాడనే-వినండి.

గీ. ప్రేయసీ! నీ శరీరంబు ఫ్రీ (**Free!**) తమంబు;
పాలతి! నీడెందము కుబేర పుష్పకంబు;

ఇక్కడ కొంచెం చమత్కరించినాను; కుబేర పుష్ప కంలో ఎందరు కూర్చున్నా ఇంకొక్కరికి చోటుంటుంది- అలాగే ఆవిడ మనసులో,

మహా:—ఇదేమిటిది? ఏ భక్తిచింతామణి పద్యాలో చదువుతారని నేను చూస్తూ వుంటే, ఈ పోకిరీపద్యాలు ప్రారంభించే వేమిటయ్యా, నీకు వచ్చిన యేళ్లెవరికి వచ్చే యి? అన్నం తిని బట్టకట్టే మనిషికి బుద్ధీశుద్ధీ ఉండవద్దూ? నీ భార్య దగ్గర నీ అక్కచెల్లెండ్ల దగ్గర ఇంకొకరిటువంటి కూతలు కూస్తే నువ్వూరుకుంటావా? నువ్వేమో దగు ల్బాజీ మనిషి లాగున్నావు. నీ వ్యవహారం నా కనుమా నంగా వుంది. నువ్వెంతకైనా సాహసుడివి. గొలుసు లాగి, రైలు నిలిపి నిన్ను స్టేషన్ మాస్టరు కప్పగిస్తా. (లేస్తుంది)

నరు:—(దిగ్గున లేచి కాళ్లపై బడి) తల్లీ! రక్షించు రక్షించు. నా కర్మం కాలి ఈ పెట్టెలో యెక్కేను. నువ్వు తొందర పడి గొలుసు లాగితివా-చచ్చిపోతే చచ్చి పోయినాను-నేను వెంటనే వెలుపలకు గెంతి వేస్తాను. నా మనసులో నాకోదురుద్దేశం లేదు- నా ప్రాలబ్ధం నన్నిలాగు ముప్పుతిప్పలూ పెడుతున్నాది గాని.

మహా:—అయితే భక్తచింతామణి పుస్తకం పట్టుకొని ఖంగాళీ పద్యాలు చదవడ మేమిటి?

నరు:—ఖంగాళీ పద్యాలు కావు తల్లీ-బంగాళీ పద్యాల ననుసరించి వ్రాసినవి. ఇది ప్రేమామృతమనే గ్రంథము-స్వయం కృతాపరాధము. ఇగి భక్తచింతా మణి పుస్తకంతో కలిపి కుట్టాను. ప్రియురాలూ భగవం తుడూ ఇంతేకదా ప్రాణికి? ఇది కావలిస్తే ఇది అది కావలిస్తే అదీ చదువుకుంటాను.

మహా:—నీకు 60 వెళ్లి 70-వ పడి వచ్చింది. కళ్లు గుంటలు పడి పళ్లు రాలిపోయి ఒళ్లు సడలి పోయిన యీ వయస్సులో రామా కృష్ణా గోవిందా అనుకుంటే బాగుంటుంది గాని నోరు తెరచు కొని ప్రేయసీ ప్రేయసీ అని అరుస్తే ఎవరైనా హర్షిస్తారా? ఏమి బుద్ధిమంతు డివి? విశేషించి ఆ పుస్తకం తెచ్చి ఒంటిగా నున్న ఆడదాని దగ్గర చదువుతావా?

నరు:—క్షమించి నా మాట కొంచెం జోర నివ్వండి. ఇది పూర్వకాలపు శృంగారం కాదు. ప్రబంధాలలో లాగు ఇందులో కుచకచాదులు వర్ణనలూ, అధరపాన ఆలింగనాది సంభోగవర్ణనలూ లేవు. ఇప్పటి కాలంలో ప్రేమశృంగార ప్రధానం కానక్కర లేదు. ఇది విషాద ప్రేమ. ఆ ప్రేమనే ప్రేమామృతమనే యీ గ్రంథంలో చూపించినాను.

మహా:—జీవామృత మన్నట్లు ప్రేమామృత మేమిటి?

నరు:—ప్రేమ భగవత్స్వరూపము; భగవంతుడు ప్రేమమయుడు-లోకం ప్రేమ పూర్ణము. ఇందులో ఒకడు

ఒకితెను ప్రేమిస్తాడు. ఆమె అతణ్ని ప్రేమించక ఇం కొకణ్ని పెండ్లాడుతుంది. మొదటి వాడు సస్తాడు. ఇదీ కథ.

మహా:—సస్తే మరి ఈ అమృతం బ్రతికించ లేక పోయిందా? అయినా యింత అసందర్భపు కథ యేమిటి? ఎవర్తో ఎవణ్ణో పెండ్లాడితే ఇంకొకడు చచ్చిపోతాడా? తుంటి కొడితే పళ్లు రాలేయట! మొన్న ఎక్కడో భూకంపం పెట్టిందే–ఎందరో స్త్రీ పురుషులు చచ్చి పోయినారు—చచ్చిన మొగుడి కోసం పెళ్లాం గాని, చచ్చిన పెళ్లాం కోసం మొగుడు గాని చచ్చినట్లు ఒక్క నిదర్శనముందా? ప్రేమట! ప్రేమ ఆమాట అంటే నా కసహ్యం. బుద్ధిలేని భగవంతుడాలాగు చేసి పెట్టేడు గనుక దిక్కుమాలిన జీవులు మొగుడనీ పెళ్లామనీ యేడ వడం. అదైనా బ్రతికి వున్నంత కాలమే. ప్రేమ కోసం చచ్చిన వారితో ఎవ్వరూ చావరు.

నరు:—అది నిజమే కాని మరి పుస్తకాలలో ఆలాగు వ్రాయవలె—కలిస్తే చాలా సుఖ పడ్డారనీ, విడి పోతే చచ్చి పోయి నారనీ. ఇది జరిగిన కథే. ఇందులో కథా నాయకుడు నిజంగా చచ్చి పోలేదు. వెర్రెత్తి పోయి నాడు. వెర్రెత్తిన వాడు చచ్చిపోక పోతాడా అని చచ్చి పోయినట్లే వ్రాసేను.

మహా:—అందరూ ఎప్పుడో ఒకప్పుడు చచ్చి పోవల సిన వాళ్లే; చచ్చి పోయినట్లు చేతనైనంతవరకూ ఉత్త రాలు రాసి పార వేయండి. మనుష్యులలో కవిత్వం ప్రవేశించే సరికి ఆ వున్న బుద్ధి కాస్తా పోతుంది కాబోలు.. ఆ గ్రంథం మూసేసి ఆ జరిగిన కథ యేదో చెప్పండి విందాం.

నరు:—చెప్తాను. మహావిషాదకరమైన గాథ. హృద యం బ్రద్దలు కొట్టేస్తుంది. కథ సగం చెప్పేసరికి ప్రతీ వాళ్లు నేల పడి దొర్లడం, వెక్కి వెక్కి యేడవడమున్నూ.

మహా:—నే నాలాగు దొర్ల లేను, యేడవ లేను—మీ యిష్టం వస్తే చెప్పండి లేకుంటే మాని వెయ్యండి కాని, (తమలపాకులు తీసింది)

నరు:—వినండి. (చుట్ట ముట్టిస్తాడు)

మహా:—ఏమండోయ్! చుట్ట పారేయండి. ఆ పొగ నాకు పడదు.

నరు:—రోజుకు 40 చుట్టలు కాల్చే ముండాకొడుకుని- 2 గంటలయింది–చుట్ట అన్న వాసన యేమిటో యెరుగను- నన్నెందుకు పీడిస్తారు—

మహా:—ఆ పొగ తగిల్తే నాకు తల గిర్రున తిరిగి పోతుంది.

నరు:—అది లేక పోతే నాకు మొఘం తిరిగి పోతుంది–ఏం దారి?

మహా:—ఏమిటి నాకీ బాధ ఇక్కడ?

నరు:—బాధ మీకా నాకా–కోప పడ కండి గాని మీరు తమలపాకులు వేసుకొంటూ వుంటే నేను వద్దన్నానా?

మహా:—అయితే దానికీ దీనికీ సాటా? మీ లాటి వాళ్లతో మాటలేమిటి? నాకు కథా వద్దు కాకర కాయా వద్దు–కాశీమజిలీలు చదువుకుంటా.

నరు:—వద్దు వద్దు. చుట్ట పారేస్తా (విసరి) కథ వినండి. ఇది 40 ఏండ్ల క్రిందటి ముచ్చట. రాజమండ్రీలో–ఆరోజు లలో–ఇంకేమిటి లెండి–ఆహా. అవో రోజులు–పోయింది పోయింది—

మహా:—ఏమిటి పోయిందండీ?

నరు:—ఏం చెప్పను! మనిషి జీవితం వుందే–ప్రేమా మృతంలో చెప్పాను–తీసి చదువుతానుండండి– (పుస్తకం విప్పి)

గీ ధరణి లోపల తా నొందు దలచు నేని
ఒనర నెందున దైవ మింకొకటి తలచు...

మహా:—(పుస్తకం చేతులో నుంచి లాగుకొని వెనక వేసుకొని) ఇంక కథ సజావుగా టూకీగా చెప్పండి.

నరు:—ఆ రాజమహేంద్రవరంలో – ఆ ఇన్నీసు పేటలో–ఆరోజుల్లో–ఆహా–అవో రోజులు—

మహా:—ఆరోజుల్లో?

నరు:—ఒక ఆడమనిషి వుండేది.

మహా:—ఇన్నీసుపేట కంతకీ ఒక్క ఆడమనిషా వుండేది!

నరు:—అంటే ఒక పిల్లవుండేది. పిల్లేమిటి చక్కని చుక్క. దివిటీ లాగుండేది. ఇంత లేసి కళ్లు జిగజిగ

మెరుస్తూ. పట్టపగలు దివిటీ లాగుండేది. ఆ తలకట్టూ, ఆముక్కూ—ఆ సౌందర్యమంటే అప్పటి వాళ్లదేనండి—ఇప్పుడేముంది గనుక—కుండ బొమ్మలు—ఆ అందం ఒక్క సీసంలో యెక్కించేను—ఆ పుస్తకమిటివ్వండి.

మహా:—ఎందుకులెండి — మీ రేమ బాధపడతారు గను కనా? ఆవిడ చాలా అంద మైనదే అయి వుంటుంది. తర్వాత చెప్పండి.

నరు:—ఆవిడ బాలవితంతువు.

మహా:—ఇది యెన్నాళ్ల క్రిందట ముచ్చటన్నారూ?

నరు:—ఎన్నాళ్లంటే యేమిటి చెప్పను? కాలచక్రం అన్నారు—కాలం రెక్కలు కట్టుకొని యెగిరి పోతుంది—ఇంకా నిన్నో మొన్నో జరిగినట్లుంది—అప్పుడే 40 యేళ్లయి పోయింది. (ఏడుస్తాడు)

మహా:—మధ్య మీరు తన్మయులై పోతున్నారేమిటి? ఈ బాధ అంతా మీకేలాగుంది.

నరు:—గ్రంథకర్తకు కథానాయకుడితో సంపూర్ణ సానుభూతి వుంటేనే గాని సరిగా రసనిష్పత్తి కాదు. కథానాయకుడు నా పినతండ్రి కొడుకు. తర్వాత కథ వినండి.

మహా:—40 ఏండ్ల క్రిందటా? ఇన్నిసు పేటలోనా? ఆవిడ పేరు?

నరు:—పేరా? పేరు! ఆహా! ఆరోజుల్లో—ఆవో రోజులు, ఆవిడ పేరు నాయనమ్మ పేరే గాని, ఆవిడను మా వాడు ముద్దుముద్దుగా 'లిల్లీ' అని పిల్చేవాడు. 'లిల్లీ' అనగా జాబిల్లిలోని చెవులపిల్లి అని అర్థం. అంత చక్కని మనిషి. అంత చక్కని రూపు. అంత...

మహా:—(ఒక్క పెద్దనిట్టూర్పు పుచ్చి బల్లకు చేర బడి పోయింది)

నరు:—అదేమండీ! ఆలాగై పోతున్నారేం?

మహా:—(కాళ్లు చాచుకొని పండుకొంది)

నరు:—లేవండి లేవండి ఏమిటి సంగతి?

మహా:—(పైట చెంగు మొఘం మీద నుంచి ముసుగేసుకొంది)

నరు:—అదేమిటండీ! సంగతి చెప్పండి. నావల్ల తప్పు లేదు కదా! నాకు భయం వేస్తున్నాది. ఉండుండి దిగ్గున లేచి గొలుసు లాగరు గద!

మహా:—(సమదాయించికొని లేచి కూర్చుండి) ఆవిడ మా మేనమామ కూతురు లెండి.

నరు:—ఎవరు? మాలక్ష్మమ్మ గారు?

మహా:—అవునండీ! మీ పినతండ్రి కొడుకు నరసు పంతులుగారు కారటండీ?

నరు:—అవును మీకేం తెలుసును?

మహా:—మామహాలక్ష్మి అన్ని సంగతులూ నాతో చెప్పేది?

నరు:—మానరసుపంతులూ ఆలాగే. ఇంక మీకు చెప్పవలసిన దేముంది? వారిద్దరిదీ ఏమనురాగమండీ! భగవంతుడు చూడలేక పోయినాడు గాని వారికే వివాహమై యుంటే వారి దాంపత్యం సీతారాముల దాంపత్యం లాగు సావిత్రీ సత్యవంతుల దాంపత్యం లాగు ఇంకా పురాణములోనూ పుణ్యకథలలోను వున్న దంపతులందరి దాంపత్యం లాగు అమోఘంగా వుండేది. ఈ వివాహమే జరిగి వుంటే విధవావివాహా లన్నిటిలోనూ శిరోమణి కావలసింది.

మహా:—నిజం. ఆవిడ గుణసంపత్తి అటువంటిది—కలియుగసీతాదేవి!

నరు:—ఆవిడ గుణం ఏలాగున్నా అతడు మహానీయుడు—సాక్షాత్తూ ప్రణయమూర్తి.

మహా:—అతడే అంత మహానీయుడైతే ఆ పెండ్లి ఆలాగు నీరు కారడమేమి?

నరు:—ఆవిడ తెలివితక్కువ తనం వల్ల. ఆవిడకేమో మనసు నిండా ప్రేమ వుంది. నిజమే—కాని ఎంత ప్రేమ వుందో అంతకు పదిరెట్లు భయం వుంది. ఆ భయమే కొంప ముంచి వేసింది.

మహా:—భయం సిగ్గూ ఆడదానికి అలంకారాలు గావటండీ!

నరు:—పెళ్లయితే అలంకారాలుగాని పెళ్లి కాక ముందు వితంతువుకు అలంకారాలేమిటండీ—నాకిప్పటికి మంట రగిలి పోతున్నాది. మనుషులుంటే మాటాడేది

కాదు- లేకుంటే మాటాడేది గాదు. పెళ్లి చేసుకోవలెనని వుందీ- ఆమాట తన తండ్రితో చెప్పేది కాదు. మావాణ్ని చెప్పనిచ్చేది కాదు. కొసకు ఇక్కడుంటే వ్యవహారం తెమలదు. తన తండ్రిని వుత్తరం ద్వారా అడుగు దామని మావాడు స్వగ్రామం వెళ్లేడు-కాలూ చెయ్యీ కూర్చుకోవడంలో కొంత ఆలస్యమైంది-ఈ లోపున ఎవడో వచ్చి తన తండ్రిని అడిగేడు-ఈవిడ భయం చేత కాదన లేక పోయింది-పిల్లను వీరేశలింగంగారు పుణ్యం కట్టుకొన్నారు. మా వాడు వెర్రివెధవ అయి పోయినాడు (ఏడుస్తాడు)

మహా:—మీగు చెప్పిందంతా శుద్ధ తప్పు. ఈలాగునే మీరు గ్రంథంలో వ్రాసి వుంటే గ్రంథమంతా మార్చి తిరిగి వ్రాయ వలసి వుంటుంది. సాక్షాత్తూ ప్రణయ మూర్తి అని మీరు చెప్పిన ఆమహానీయుడు ఒకనాడు అర్ధరాత్రివేళ చెప్పకుండా చేయకుండా లేచి పోయినాడు. రోజులు వారాలూ నెలలూ చూసింది ఆ మహా యిల్లాలు. అతని పత్తా లేదు. తర్వాత కొన్నాళ్లకు ఇతడు మద్రాసులో విధవావివాహం చేసుకొన్నట్లు-ఆ వృత్తాంతం ఆ ఫొటోలూ పేపర్లో చూసింది. నిద్రాహారాలు మాని యేడ్చియేడ్చి చిక్కి శల్యమై పోయింది. తర్వాత మేమందరమూ దీనిని బ్రతికించు కోవడమేలాగు రా భగవంతా అని బోధించగా బోధించగా కొసకు ఆయన కేది గతి అయితే నాకూ అదే అని తానూ పెండ్లాడింది.

నరు:—ఏమిటీ యేమిటీ! వాడు పెండ్లాడిన తర్వాతనా తాను పెండ్లాడింది? అన్నీ తెలుసునేమో ఈలాగంటా రేమిటండీ? తన పెండ్లి అయిన ఆరు మాసాలకు మేమందరమూ బోధించగా బోధించగా పరువు నిలబెట్టుకొందుకు వాడేగో పెండ్లాడేడు.

మహా:—లేదులేదు-ఆయన పెండ్లీ ముందరయింది-ఆ సంగతి తెలిసే తాను పెండ్లాడింది.

నరు:—లేదండీ. ఈ ప్రేమామృతం పట్టుకొని ప్రమాణం చేసి చెప్తాను-ఆ పెండ్లి మార్చిలో-ఈ పెండ్లి అక్టోబరులో.

మహా:—నెలలేమో రైటే-నేనూ కాశీమజిలీలు పట్టుకొని ప్రమాణం చేసి చెప్తాను-మొదట తన పెండ్లి; తర్వాత నా పెండ్లి.

నరు:—లేదు లేదు లేదు. తర్వాతనే నా పెండ్లి.

మహా:—ఆఁఆఁ మీ పెండ్లా? మీపెండ్లా!

నరు:—ఆఁఆఁ మీ పెండ్లా? మీ పెండ్లా? మీరేనా మీ మేనత్తకూతురు?

మహా:—మీరు! మీరు! మీరేనా మీ పినతండ్రి కొడుకు!

నరు:—మహాలక్ష్మమ్మా!

మహా:—నరుసు పంతులుగారూ!

(ఇద్దరూ పరాఙ్ముఖులై కాళ్లు చాచి పండు కొని యేడుస్తారు)

నరు —(ఇటు తిరిగి యేడుస్తూనే) ఊరుకోరూ?

మహా:—(ఇటు తిరిగి యేడుస్తూనే) మీరూరుకోరూ?

నరు:—(ఏడుస్తూ కూర్చుండి) 40 ఏళ్లనుంచీ దేముడు నా బ్రదుకొక్క యేడుపే చేసి వేశాడు. ఏలాగూరుకొనేది?

మహా:—(కూర్చొని · యేడుస్తూ) ఈ 40 ఏళ్లనుంచీ కంటికి నేలకి ఏకధారగా ఏలాగేడుస్తున్నానో ఆ భగవంతుడికి తెలుసును.

నరు:—నా బ్రతుకీలాగు కావడానికి మీరే కారణం. ఊరుకోండి.

మహా:—మీవల్లనే నా కిటువంటి గతి పట్టింది. ఊరుకోండి.

నరు:—మహాలక్ష్మమ్మా! మహాలక్ష్మమ్మా!...

మహా:—అదుగో స్టేషను వచ్చింది. అది దాటే వరకూ మాటాడ కండి.

నరు:—ఇంకా మొదటి రస్తావే? అది పుట్టుకతో పుట్టింది-ఏం చెయ్యను! (భక్తచింతామణి తిసి పద్యాలు కూను రాగంతో చదువు తాడు) ఆఁ ట్రెయిన్ కదిలింది (పుస్తకం టప్పున మూస్తాడు)

మహా:—ఆఁఆఁ పుస్తకం తెరవండి. ఈ ట్రెయిను కాదు; ఎదురు గుండా వున్నగుడ్సు ట్రెయిన్ పోతున్నాది. ఇదిగో స్టేషన్ వేపు చూడండి తెలుస్తుంది.

నరు:—(మరో పద్యం చదివి) ఆఁ ట్రెయిన్ కదిలింది.

మహా:—ప్లాటుఫారం దాటి పోనివ్వండి.

నరు:—(పుస్తకం మూసి) ఎన్నాళ్లకు మిమ్మల్ని చూసినాను!

మహా:—మిమ్మల్ని చూసి 40 ఏళ్లు అయి పోయింది– కళ్లు కాయలు కాచి పోయినాయి.

నరు:—ఆ మాలదైవం మన యొప్పిదం చూడ లేక యీలాగు విఘాతం కలిగించేడు.

మహా:—ఇంత పాపానికి నెట్టుకొన్న ఆ భగవంతుడి నెత్తి బ్రద్దలు కొడితే పాపముందీ! ఏయేడిపించేడు ఏయేడిపించేడు ఇద్దరినీ!

నరు:—ఇప్పుడు- ఇక్కడ- ఈలాగు- అనుకోకుండా- మన మిద్దరమూ కలియడమనేది కేవలంగా భగవత్సంకల్పం గనుక భక్తపరాధీనుడైన ఆ భగవంతుణ్ని మనమిద్దరం కలిసి మొదట ఒక్కసారి ప్రార్థిద్దాము.

మహా:—మంచిది. మీరు చెప్పండి; నేను వెనుక అంటూ వుంటాను.

(ఇద్దరూ తమ తమ బల్లల మీద మోకరించి)

నరు:—ఓసర్వేశ్వరా- నీవు దయామయుడవు- నీవు ప్రేమమూర్తివి. ప్రేమ మూలముననే-నీవు లోకములు- సృష్టించి తెంచుచున్నావు. ప్రేమగలవారిని-నీవు-ప్రేమింతువు- ప్రేమను- నడమ తెంచినను- తర్వాత- ముడి వేయుదువు- ప్రేమమూర్తులమైన మమ్ము- ఇట్లు- కలిపినందుకు- నీకు- మేము- కృతార్థులము.

మహా:—చాలు లెండి.

నరు:—మహాలక్ష్మమ్మగారూ! ఈ ట్రెయినులో ఇద్దరం కలిసి వుండి కూడా ఎంతకాలం వ్యర్థం చేసి వేసినాము!

మహా:—అప్పుడు రెండేళ్లు. తర్వాత 40ఏళ్లు. ఇంతా వ్యర్థం కాగా ఈ రెండు గంటలకేనా? బ్రతుకులే వ్యర్థమై పోయినవి.

నరు:—మొదటనే నేను ఫలానా అని యెందుకు చెప్పేరు కారండీ!

మహా:—అమాట మీరైనా చెప్పేరా?

నరు:—తీరా నన్ను బండీలో నుంచి తరుముతూనే వున్నారు- నయం నేను దిగి వెళ్లిపోతే- అడిగేరూ- నాకంటె దౌర్భాగ్యుడుండునా?

మహా:—పరాయి పురుషులనుకొని మిమ్మల్ని ఆలాగు తరమడం లోనే నా గుణం మీకు తెలిసి వుండ వలసింది.

నరు:—ఇప్పుడానందిస్తున్నాను- మీగుణం నాకిప్పుడా మిమ్ము చూడక ముందే తెలిసింది. కనుకనే అంత ప్రేమతో అంత విశ్వాసంతో అంతగా ఆశించేను. ఆహా! అనుకొన్నట్లు మనం పెండ్లాడి వుంటేనా!

మహా:—మన మనుభవించే సౌఖ్యమెవరనుభవించి వుందురు!

నరు:—నాకిప్పుడొక్క కోరిక వుంది. కాదనకుండా మీరు మన్నించ వలె. పూర్వం మీరు నడుస్తూ వుంటే నవరత్నాలు రాలుతూన్నట్లుండేది. పరుగిడితే పాల్వా పిట్ట ఎగిరినట్లుండేది. అది చూడాలని వుంది. ఒక్కసారి ఒక్కసారి నడవరూ? నా ఆశతీర్చరూ?

మహా:—(సిగ్గుతో) ఎందుకు లెండి? పోనిస్తురు వద్దు.

నరు:—లేకుంటే నేను బ్రదకను. నడకకు తప్పేమిటి? ఒక్కమారు. (ఆవిడ అందంగా నడవాలని నడుస్తుంది)

నరు:—(అదే దృష్టిగా చూచి అసంతృప్తితో) బాగానే వుంది.

మహా:—ఏం బాగులెండి. ఇంకా పూర్వకాలం మనుషులం గనక ఈ మాత్రం. ఇప్పటి వాళ్లయితే మన వయసు వచ్చే సరికి!

నరు:—అంతే అంతే... మీకిప్పుడు వయసు 50 కంటె యెక్కువుంటుందా?

మహా:—ఎక్కడిదండీ మీకు తెలీదూ! 42కాబోలు- అంతే. మీ వయసు?

నరు:—ఇదుగో- 28ఏళ్ల సర్వీసు మీద రిటైరయినాను. రిటైరై 15 ఏళ్లయింది. అంతే. 28+43—అన్నమాట. ఎవరి కంటె మనమేం ముసలివాళ్లం గనుక, నిన్న మొన్నటి వాళ్లం.

మహా:—మనోవ్యాధి ఎక్కువగా వుంటే తలనెరసి పోవడమనీ—

నరు:—పళ్లు పడి పోవడమనీ—

మహా:—శరీరం బిగువు చెడి ముడుతలు పడి పోవడమనీ—

నరు:—దృష్టి ఏ వస్తువు మీదా సరిగా ఆనక పోవడమనీ—

మహా:—ఇప్పుడెందుకు పోనిస్తురూ ఈ ఓఘాయిత్యం మాటలు.

నరు:—అడిగేను మాట వరుసకి. వయసెవరు చూస్తారు? రూపమెవరు లెక్కిస్తారు? ప్రేమ- ప్రేమ- అదీ ముఖ్యం.

మహా:—నా వుద్దేశం కూడా అదే- ప్రేమ వుండాలి. ప్రేమ అంటే ప్రాణం నాకు.

నరు:—నా హృదయం మీ బానిస. ఈ జన్మలో కాకుంటే వచ్చే జన్మలో నైనా మిమ్ము పొందవలెననే నా తపస్సు.

మహా:—శరీరం ఎవరిదైతేనేమి- హృదయం అది మీ అధీనమనుకోండి.

నరు:—ఆ సంతృప్తితోనే యింత కాలం బ్రతికి వున్నా.

మహా:—పాపం మిమ్మల్ని చాలా యిబ్బంది పెట్టేను- ఎంత బాధపడుతున్నారో చుట్ట కాల్చుకోండి.

నరు:—అబ్బబ్బా! వద్దు లెండి. మీకు తల తిరుగుతుంది ఆ పొగకు.

మహా:—మీరు కాలిస్తే తిరగదు. కాల్చక పోతే నా మీద వొట్టు.

నరు:—ఇదీ ప్రేమలక్షణం—ఏది పరాయి మగవాడి నోటి నుండి వచ్చేటప్పుడు తనకు తలత్రిప్పుతుందో- అదే తన ప్రియుడి నోటి నుండి వచ్చేటప్పుడు......వచ్చేటప్పుడు...మరి...

మహా:—తనకు అమృతం లాగుంటుందో అదే ప్రేమ. మరి కాల్చండి.

నరు:—(కాలుస్తూ) మహాలక్ష్మమ్మా! నీ కెందరు పిల్లలు?

మహా:—ఏం పిల్లలు పోనిస్తురూ! 5గురు కూతుళ్లు. ఒక కొడుకూ మనమలో 12గురున్నారు. మీకో?

నరు:—సంతానం కేవలంగా భగవదిచ్ఛ. నాకూ 5గురు కొడుకులూ ఒక కూతురున్నా. మనుమలూ వుంటారు 14-15 గురు.

మహా:—ఏదో ఒకరి దగ్గర వున్నప్పుడు ఏ యెండకా గొడుగు పట్టక తప్పదు.

నరు:—నిజమే. ఇంతకీ ఈలోకంలో వున్న తర్వాత ఈ ఆట ఆడక తప్పుతుందా?

మహా:—ఇప్పుడు నేనీసంసారం బెడద అంతా వదులుకొన్నాను.

నరు:—నేనూ వదలుకొన్నాను- కనుక ఒక్కమాట చెప్తాను వింటారూ- మీకూ నాకూ గూడా పిల్లలు పెద్దవాళ్లయి పోయి నారు. ఏ బాదరబందీ లేదు. పదండి. ఈలాగు ఎక్కడికైనా దేశాంతరం వెళ్లి పోదాం- తక్కిన జీవితశేషమైనా సుఖంగా గడిపి వేతాం.

మహా: ఎక్కడికి వెళ్లి పోదాం?

నరు:—ఎక్కడికైనా సరే. ఏ కోమటికొట్టు మీదనో గుమస్తాగా నైనా ప్రవేశించి రోజుకు 6అణాలు సంపాదించ లేక పోను.

మహా:—మీరు సంపాదించకుంటే నా వొంటి మీద బంగారం లేదూ?

నరు:—అదికాకుంటే యోగినై నే నొక ఆశ్రమం పెడతాను; మీరు శిష్యురాలుగా ఉందురు గాని.

మహా:—కాని ఇన్నాళ్లయి పోయిన తర్వాత ఈ వయసులో లేచి పోవడ మేమిటి?

నరు:—అన్నా! ఆడవాళ్లతో ఇదే చిక్కు. తమకు తోచదు; చెప్తే వినరు. శాస్త్రరీత్యా లేచి పోవడానికి ఇదే వయసు- దిలీపుడు రఘుమహారాజు మొదలైన వాళ్లందరూ తమ ప్రియురాండ్రను తీసుకొని ఈ వయసులోనే కదూ వానప్రస్థమునకు వెళ్లడం.

మహా:—ఇప్పుడు కలుసుకొన్న తర్వాత నోటి వెంబడిని ఇన్ని చిలుక పలుకులు వస్తున్నవి కాని- ఈ40 ఏళ్లలో ఒక్కమారు ఒక్కమారైనా వచ్చి మొఖం చూపించారా? వరుసగా 20ఏళ్లు రాజమండ్రీలోనే వున్నామే!

నరు:—రాజమండ్రీలో అంత ఘోరం అన్యాయం జరిగిన తర్వాత మళ్లీ నాకు రాజమండ్రీ రమ్మని వుందీ? గోదావరిలో స్నానం చెయ్యమని వుందీ? గౌతమీ లైబ్రరీకి వెళ్లమని వుందీ? గున్నేశ్వరరావు నాటకం చూడ

మని వుందీ? నేను కొడుకులకీ మనమలకీ ఇన్ని సంబంధాలు చేశాను గాని రాజమండ్రీ సంబంధం ఒక్కటీ చెయ్యలేదే. ట్రెయినులో ప్రయాణం చేసేటప్పుడు గూడా రాజమండ్రీ స్టేషన్ వచ్చే సరికి ఇటున్నవాణ్ని అటు పోతాను.

మహా:—పోనీ బరంపురమేమి చేసింది? బరంపురం రా కూడదా?

నరు:—ఏమని వచ్చేది? ఏ మొఖంతో వచ్చేది? ఒకమారు కాకినాడలో ఒక ఆవిడ జట్కా మీద నుంచి వెళ్తున్నాది- మీరే అనుకొన్నాను. వెంటనే జట్కా చేయించుకొని తిరిగి తిరిగి కలుసుకొని, మహాలక్ష్మమ్మ గారూ అన్నారు. 'ఎవరు మహాలక్ష్మమ్మ అంది ఆవిడ.' తిరిగి వచ్చేశాను.

మహా:—ఇంకొకమారు నేను రైలులోంచి వెళుతూ వుంటే- ఆ ప్రక్క పొలాలలో నుంచి నడచి వెళ్తున్నారొకాయన. అచ్చా మీలాగే వున్నారు; మీరే నేమో కూడా రైలులో నుంచి గెంతి వేదామా అనుకొన్నాను.

నరు:—(ఆదుర్దాతో) గెంతి వేయ లేదు కద కొంప తీసి? ప్రేమ మహా చెడ్డది.

మహా:—మీరవునో కాదో నిశ్చయం తెలియక పోవడం వల్ల గెంత లేదు.

నరు:—నేనే అయి వుంటాను; నేనే- మిమ్మల్ని తలచుకొంటూ పొలాల మీద నుంచి వెర్రివాడి లాగు తిరుగుతూ వుంటాను.

మహా:—నిజంగా నామీద మీ కటువంటి అభిమానముందీ?

నరు:—ఉందో లేదో తెలుసుకొనే వుత్సాహం మీకుంది గనుకనా? ఇదిగో! నా గుండె చీల్చి చూస్తే- (ఆవిడ బల్ల మీదకు వెళ్తాడు)

మహా:—ఆఁఆఁ ఇక్కడ కూర్చోవద్దు- ఎవరైనా చూచి అనుమానించ గలరు.

నరు:—ఏమనుమానిస్తారు? భార్యాభర్తల మను కొంటారు అంతేనా?

మహా:—వద్దు వద్దు- వెళ్లండి. నేను చెప్తాను వెళ్లండి పోనిండి అయితే (తాను వెళ్లి అతని బల్ల మీద కూర్చుటుంది)

నరు:—మీ పిరికితనమే మన బ్రతుకులింతకు తెచ్చింది. ఆ మాత్రం ఒక్క బెంచీ మీద కూర్చుంటే వచ్చిన తప్పేమిటి? (తన బల్ల మీదకు వెళ్తాడు)

మహా:—మొదటి నుంచీ ఒకటే మచ్చు; మీకు తోచదు; ఒకరు చెప్తే వినరు. (తన బల్ల మీదకు వస్తుంది)

నరు:—బాగుంది- కానివ్వండి. అయినా చెప్తాను- మీ హృదయంలో దయాదాక్షిణ్యం అన్నవి లేవండి (దిగాలపడి కూర్చుంటాడు)

మహా:—అప్పుడే కోపం వచ్చిందా? అబ్బా! మీ లాటి మనుషులతో వేగడం మహా కష్టమండి...ఔను ఎందుకు కోపం?

నరు:—నేనింక ·అట్టే కాలం బ్రదకను- ఈ బాధ భరించలేను- నాగుండె బ్రద్దలై పోతూ వుంది- నేను చచ్చి పోతాను.

మహా:—మీరు పోతే నేనేనా యేమిటి బ్రదుకుతాను? మీరు పోయిన తర్వాత నాకేముంది గనుక- నేనూ చచ్చి పోతాను.

నరు:—ఆ నాతో, ఒకబెంచీ మీద నుంచి మరో బెంచీ మీదకు రాలేరు_ ఒకలోకం నుంచి ఇంకొక లోకానికి వస్తారు! నేనూ వెర్రివాణ్ని కనక నాతో ఇన్ని ఆటలాడుతున్నారు.

మహా:—ఈకూ సాకూ లేని ఈలాటి మనుష్యులకి ఏమిటి చెప్పడం? ఆ యెదురుగుండా పొలాల్లో ఎందరు మనుష్యులున్నారో చూశారా? మన యిద్దరం ఒక దగ్గర కూర్చుంటే యే మనుకుంటారు?

నరు:—అంటే నా జీవితానికి ఆ మాత్రమదృష్టం కూడా లేదన్న మాట! ఈ జన్మలో ఆ ముచ్చటైనా నాకు రవంత తీరదు.

మహా:—కొంచెమోపిక పడితే సరి; అన్నిముచ్చటలూ తీరుతవి.

నరు:—ఇంకా ఆశ వుందీ?

మహా:—ఎందుకుండదూ ? మీరుండేవరకూ నేనుండే వరకూ తప్పకుండా వుంటుంది (తమలపాకులు తీసింది)

నరు:—నాకు రెండు చిలకలు చుట్టి యివ్వరూ ?

మహా:—ఇదండి (ఆకూవక్కా యెత్తి చేతిలో పడ వేయ బోతుంది)

ఆహా:—ఆహా ! ఏమి సరాగమండీ ! బిచ్చగాడికి విస్తరాకు పడేసినట్లు ఎత్తిఎత్తి మరీ పడేస్తున్నారు. ఆకులు చక్కా చుడుతూ మీరొకటి కొరికె నాకొకటి యివ్వకూడదటండీ ! ఆ మాత్రం ముచ్చటైనా తీర్చ కూడదా.

మహా:—బాగుంది. ముసలి కాలానికి ముచ్చటలని—ఆకరికి మీరింత నిర్భయంగా బడి తెగి పోయినా రేమిటీ? ఆకులు చుట్టి యివ్వడమే ! ఇంకా నోటికందించ మన్నారు కారు ! అమ్మో ! ఎవరైనా చూస్తే?

నరు:—ఇక్కడ ఈగదులో మీరూ నేనూ తప్ప ఎవ్వరూ లేరాయె. ఆకులందించిన మాత్రంచేత ఏం కొంప మునిగి పోతుంది ?

మహా:—మీ ధర్మమాయె— అంత లేసి కేకలు పెట్టకండి. ఇవతల పెట్టెలలోనూ అవతల పెట్టెలలోనూ మనుషులున్నారు— వినగలరు.

నరు:—అవునవును. ఆకోసను డ్రైవరూ ఈకోసను గార్డూ వున్నారు. లోకమంతా మన యిద్దరినే, ఈనాటికి కలిసేమని, కనిపెట్టుకొని తిరుగుతున్నాది. అక్కర లేదు లెండి నాకాకులక్కరలేదు.

మహా:—అయితే నేనూ వేసుకోను.

నరు:—మీరు వేసుకోక పోతే నా మీద వొట్టు. నా కోసం మీ సౌఖ్యమేదీ మీరు చెరచుకోకండి- చెరచు కోకుగాని ! ఏదీ నా చేతికివ్వండి, నేను చుట్టి యిస్తాను.

మహా:—అబ్బా ! వద్దని యెన్నిమార్లు చెప్పవలె ? నే నెందుకు చెప్తున్నానో వినండి— మరావూసెత్తకండి. ఇదిగో స్టేషను ఆలాగు దిగాలు పడి పండు కొంటా రేమిటి ? లెండి. భక్తచింతామణి పద్యాలు ప్రారంభించండి. (తమలపాకులు వేసుకొంటుంది)

నరు:—(అటే ఆశతో చూస్తూ నిరుత్సాహంగా భక్తచింతామణి పద్యాలు చదువుతాడు)

మహా:—ట్రెయిను కదిలింది లెండి.

నరు:—కదిలిందంటే నా గుండెకాయ కదిలి పోతున్నాది. ఇంకేముంది— వచ్చేను. తర్వాత స్టేషనే వెధవ నిడదవోలు.

మహా:—తర్వాతిదే ! తర్వాతిదే ! దొంగముండా స్టేషనెంత వేగం వచ్చేసింది ?

నరు:—అయినా యీ డ్రైవరు ముండాకొడుకుల కేమి తొందర ? తాపీ తరుణం లేదు.

మహా:—ఆహా ! ఈ రైలు ఇక్కడ నిల్చి పో కూడదూ !

నరు:—అదేఅదే ! ఈ ఇంజన్ పేలి పో కూడదూ ! ఈ కైర్లు బరస్టు అయి పో కూడదూ ! నేనేలాగు దిగి పోయేది ? ఈ రైలు క్రింద పడి చచ్చి పోతాను.

మహా:—అదేమిటది ! మీరాలాగంటే నేనీ రైలులో నుంచి క్రింది కురికి వేస్తాను. ధైర్యం తెచ్చుకోండి.

నరు:—మళ్లీ మనమెప్పుడు కలుస్తామో !

మహా:—ఇప్పుడు కలిసేము కామూ ? దేముడి దయ వుంటే మళ్లీమళ్లీ కలుస్తూనే వుంటాం.

నరు:—ఏమిటి 40ఏసి ఏళ్ల కొక్కొక్కమారా ?

మహా:—ఆలాగెందు కనుకోవలె ? ఎప్పుడైనా కలియ వచ్చును.

నరు:—మళ్లీ మీరెప్పుడు తిరిగి వస్తారు గదా ?

మహా:—నేను చెప్పను చెప్తే మళ్లీ మీరా ట్రెయినుకి వస్తారు. ఇప్పుడు కలిసి వచ్చిందే చాలుచాలు— లోకం నవ్వి పోతుంది. మనసులో వున్నంతా పయికి వెళ్ల బొయ్యి కూడదు.

నరు:—పోనీ—నాది ఒక్కకోరిక వుంది- ఆఖరు కోరిక! చెల్లిస్తారా చెల్లించరా ?

మహా:—ఏమిటి గదా ?

నరు:—మీతో నేను బెజవాడ దాకా వస్తాను. దయ వుంచండి. ఇక్కడ ఒక్కడనూ దిగి పోలేను.

మహా:—అమ్మో ! బెజవాడ దాకా రావడమే ! అక్కడికి నన్ను దింపడానికి మా మనుమరాలు మగడు

వస్తాడు. అతడు మన యిద్దరినీ ఒకబండీలో చూస్తే ఏమనుకొంటాడు ?

నరు:—పోనీ— ఆ ముందు స్టేషన్లో మరో బండీలోకి వెళ్లి పోతాను.

మహా:—ఏమిటండీ మీకింత ఆలోచన లేదు! కొత్తగా ఆ బండీలోకి మీగు వెళ్తే ఆబండీలో వాళ్లేమను కొంటారు ?

నరు:—ఆ ముందు స్టేషన్లో దిగి పోతాను సరా ?

మహా:—మీరాస్టేషన్లో దిగి నేనా తర్వాతి స్టేషన్లోనే దిగితే యింకేమైనా వుందీ! మీకు వయసయితే వుంది గాని లోకజ్ఞానం లేదండి!

నరు:—అయితే చచ్చినట్లు నేనిక్కడ దిగి పో వలసిందే!

మహా:—నా మాట వినండి. ఈ మాత్రం జాగ్రతగా వుండబట్టే మనం మాట పడలేదు.

నరు:—మళ్లీ మీ సుందరవదనారవింద మెప్పుడు చూస్తాను ?

మహా:—ఫర్వాలేదు లెండి.

నరు:—మీరు రాసి ఏ దాసీదాని చేతనైనా పోస్టు చేయించ వచ్చును— ఒక్క జాబైనా వ్రాస్తారా ?

మహా:—ఎందుకు లెండి. నేను రాయను— మీరు రాయకండి.

నరు:—స్టేషను- వెధవ స్టేషను వచ్చేస్తున్నాది. పోనీ నా జ్ఞాపకార్థం ఈ ఉంగరం వుంచు కోండి.

మహా:—వద్దు వద్దు. ఇదెక్కడిదంటే నేనేం చెప్పేది ?

నరు:—పోనీ! మీ వుంగరం నాకివ్వండి— మీవారితో పోయిందని సులువుగా చెప్పవచ్చును.

మహా:—దీని మీద నా పేరుంది గదా లోకమంతా గుప్పు మని పోదూ!

నరు:—ప్రతీమాటకూ ఈలాగు అడ్డు చెప్తే ఏందారి ? పోనీ నా జ్ఞాపకార్థంగా ఈ హెయిర్ డై (Hair Dye) తలరంగు డబ్బీ వుంచు కోండి— ఎంత నెరసిన తల అయినా నల్లగా తుమ్మెదల లాగుంటుంది.

మహా:—మీరు మహాచెడ్డవారండీ (పుచ్చుకొంటుంది)

నరు:—మీ జ్ఞాపకార్థం నాకేమైనా యివ్వరూ ?

మహా:—ఏమిచ్చేది ? ఏమిచ్చినా మీవూరంతా గొప్పగొడ్డీ చాటుతారేమో అని భయం. పోనీ వుండ నివ్వండి- ఈ పళ్ల పౌడిడబ్బా— (ఎత్తి పడవేస్తే క్రింద పడి పౌడరు జల్లి పోతుంది)

నరు:—నేనూ బ్రాహ్మణ్ణే కాని పంచముణ్ని కాను. (పౌడరెత్తుకొని) దీని మీద మీ పేరు మీ చేతితో రాసి యివ్వరూ!

మహా:—అమ్మో! మీతో వచ్చిన చిక్కిదే! ఏమీ వద్దు. అది ఇచ్చి వేయండి.

నరు:—(జేబులో దాచుకొని) ఇది నా యావజ్జీవం నా గుండెల దగ్గరే వుంటుంది. మరి సామాన్లు సర్దుకొం టాను (సర్దుతూ) ఈ పాడుజన్మలో నేనేమైనా సుఖం పొందిన ఘడియలుంటే అవి యీ 4ఘడియలే!

మహా:—నాకూ అంతే!

నరు:—నేను మీకు జ్ఞాపక ముంటానూ ?

మహా:—మీకు నేను జ్ఞాపక ముంటానూ ?

నరు:—మీరే నాసౌఖ్యదేవత— అదృష్టదేవత! ఆనందదేవత!

మహా:—ఆ అభిమాన ముంచండి చాలు.

నరు:—(సర్దుకొని) ఆ చెయ్యి ఒకమారు ఈలాగి వ్వరూ— ఒక్కసారి ముద్దులాడుతా.

మహా:—మీకేం మతి పోతున్నాదా యేమిటి ?

నరు:—నేను వప్పనండీ! బలవంతంగా నైనా చెయ్యి ముద్దులాడక తప్పను.

మహా:—అయితే గొలుసు లాగమన్నారా యేమిటి ? కొసను రసాభాస చేస్తున్నారు.

నరు:—బండీనిల్చింది. దిగుతాను— పోతాను—సస్తాను. దయ వుంచండి.

మహా:—చిత్తం వెళ్లండి. ఇటు చూడకండి— బాగుం డదు.

నరు:—(దిగి కిటికీలో నుంచి తలపెట్టి) ఏదో యీ మాత్రం సుఖం గలిగింది.

మహా:—నేనూ అదే అనుకొంటున్నా- వెళ్లండి వెళ్లండి.

నరు:—ప్రేమంటే యేమిటో యిప్పుడు నాకు తెలిసింది. వెళ్తాను (వెళ్లేడు)

మహా:—వెళ్లిపోయినారు- వెళ్లిపోయినారు- నేనూ ఆవలకు గెంతి వేదునా? (కప్పుకొని పండుకొంది)

ఇంజన్ కూతా, స్టేషన్ సమీపించేటప్పటి రైలు చప్పుడూ, ప్లాటుఫారం మీద అప్పుడు కలిగే కూలీ కేకలూ అమ్మకాల గోలా, నాటకమునకు ముందు నేపథ్యము నుంచే ప్రకటించవలె.

తెర క్రిందినించి పైకి చుట్టుకొని గాక రెండుగా చీలి చెరియొక ప్రక్కకూ తొందరగా పోవలె; నాటకాంతమున మరల అట్లే కప్పుకొనవలె.

రైలు పరుగెత్తే స్థితిని రూపింపజేయడానికి- నేపథ్యమున రెండు కిటికీలనూ కప్పేటంత పెద్ద చక్రమును త్రాళ్లూ గిలకలూ (Wires & Pulleys) సహాయమున గిర్రున త్రిప్పుచుండవలె. నడుమ నడుమ నేపథ్యమును చీకటి చేసి ప్రకృతియొక్కయూ స్టేషన్‌యొక్కయూ వివిధభాగములను క్షణకాలమే చూపుతూ వుండవలె.

ఇవి యేవీ చూపించుట కవకాశము లేనప్పుడు వెనుక తెర (Back curtain) దూరముగా వుంచవలె.

రైలు నిలిచిన చోట స్టేషన్ భాగముల మాత్రము చూపక తప్పదు.

మహాలక్ష్మిపాత్ర స్త్రీయే రూపించవలె. 60 ఏండ్ల మనిషే అక్కరలేదు. 30 ఏండ్ల మనిషైనా 60 ఏండ్లుగా కనబడవచ్చును.

(అన్ని హక్కులు గ్రంథకర్తవి)




అక్షరాలు ముత్యాల కోవలు!

'రత్నా యింప్రువ్డ్"

కలాల్తో వ్రాస్తే ముత్యాలవంటి అక్షరాలు కుదుర్తాయి. ఇవి చాలాకాలం పనిచేస్తాయి.

నిప్పుకి మండవు; విరిగిపోవు; తళతళ లాడ్తుంటాయి. మంచి అందమైన బంగారు పాళీలు. వాని చివర 25-వ సంవత్సరములవఱకు పనిచేసే యిరిడియమ్ పొదగబడింది.

రకరకాల రంగులతో, రోల్డుగోల్డు క్లిప్పులతో ముద్దులు మూటగట్టే ఈకలాల వెల సరసం.

కావలెనంటే మీమీ పేర్లు కలాలమైన ఉచితంగానే చెక్కుతాం.

కావాలి మీ అందఱి ప్రోత్సాహం.

కె. రత్నా అండ్ కో.,
విద్యార్థులకు ప్రియమైన షాపు.

35, ఎస్ప్లనేడ్ రోడ్,
మద్రాసు.